

చాంపియన్లుగా తెలంగాణ

నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌ను తెలంగాణ జట్లు సొంతం చేసుకున్నాయి.

వివరాలు 8లో ▸



మత సామరస్యానికి ప్రతీక

రంగాపూర్ నిరంజన్‌షావలి దర్గా ఉర్సు 17వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /15.2

చలి ఎక్కువగా ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆయకట్టుకు చేరుకున్న ఆర్డీఎస్ నీరు



అయిజ: రైతులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఆర్డీఎస్ నీరు బుధవారం మధ్యాహ్నానికి మండలంలోని సింధనూరు గ్రామ సమీపంలోని డిస్ట్రిబ్యూటరీ 12ఏ ను చేరుకుంది. ఇటీవల రాష్ట్రానికి ఇండెంట్ పెట్టినా సరే అయిజ మండలంలోని ఆర్డీఎస్ ఆయకట్టు వరకు సాగునీరు చేరలేదు. దీంతో వెంటనే ఆంధ్రప్రదేశ్ వాటా (కేసీ కెనాల్‌కు) 2.5 టీఎంసీల ఇండెంట్ పెట్టడంతో మండలంలోని ఆర్డీఎస్ కాల్వకు సాగునీరు చేరుకుంది. రాత్రి సమయానికి ఉప్పల సమీపంలోని డిస్ట్రిబ్యూటరీ 20 వరకు నీరు చేరుకుంది. శనివారం నాటికి తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఆర్డీఎస్ కాల్వకు సాగునీరు సకాలంలో చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన

ఎర్రవల్లి: ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో పీఎం కుసుమ్ పథకం ద్వారా నిర్మించే సోలార్ విద్యుత్ ప్లాంట్ కొరకు బుధవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేందర్ వివిధ శాఖల అధికారులతో కలిసి వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన సర్వే నెంబర్ 66, 67, 68, 69, 75, 76, 77, 78, 79, 80, 82, 83 లలో దాదాపు 96 ఎకరాల 38 గుంటల ఎండోమెంట్ భూమిని పరిశీలించారు. కేంద్రం సోలార్ ప్లాంట్ నిర్మించేందుకు గాను పరిశీలించిన ఎండోమెంట్ భూమి వివరాలను ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ దౌలమ్మ, విద్యుత్ ఏఈ శేఖర్, ఎపిఎం కుర్మయ్య, ఆర్ఐ భీమ్‌సేన్‌రావ్ ఉన్నారు.

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

గద్వాలటౌన్: మహనీయుల సిద్ధాంతాలను భవిష్యత్ తరాలకు ఇవ్వాలని, రాజ్యాధికారమే తమ అంతిమ లక్ష్యమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో జన కళ్యాణ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ చీఫ్ మాయావతి జన్మదినాన్ని పురస్కరించుకుని జన కళ్యాణ్ దివస్‌ను చేపట్టామన్నారు. బీఎస్పీ ద్వారానే దేశంలోని అన్ని వర్గాల అభ్యున్నతి జరుగుతుందన్నారు. మణికుమార్, రాజు, వెంకటేష్‌నాయక్, సవారన్న, మోహన్‌రాజు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అడ్డుకట్ట పడేనా..?

జిల్లాలో జోరుగా గొలుసు దందా

- రూ.లక్షకు నాలుగు రెట్లు అంటూ బురిడీ
- నిజమని నమ్మి సామాన్యుల పెట్టుబడి
- రూ.కోట్లు మోసపోతున్న ప్రజలు
- పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు



అయిజలో ఏర్పాటు చేసిన ఓ సంస్థ కార్యాలయం (ఫైల్)

గద్వాల క్రైం: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు.. కేవలం రూ.లక్ష పెట్టుబడి పెడితే నాలుగు అంతలు ఎక్కువ అర్జించవచ్చు.. అంటూ.. సామాన్యులను నమ్మించి వారితో డబ్బులు కట్టించడమేగాక వారి బంధువులు, స్నేహితులతోనూ ఈ ఊబిలోకి లాగి బురిడీ కొట్టిస్తున్నారు కొందరు మోసగాళ్లు. ప్రస్తుతం నడిగడ్డలో ఈ దందాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో ఇటీవల అయిజ, గద్వాల రూరల్, గద్వాల పట్టణ పోలీసు స్టేషన్‌లో గొలుసుకట్టు స్కాంలపై ఇటీవల నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ. ఈ వ్యాపారం జిల్లాలో రూ.20 కోట్లకుపైగా నడిచినట్లు సమాచారం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సులభ పద్ధతిలో ఆదాయం వస్తుందని గొలుసుకట్టు వ్యాపారంలో పెట్టుబడులు పెట్టినా, పెట్టుబడులు పెట్టించినా నేరం. చిట్స్ అండ్ మనీ సర్కులేషన్ స్కీం బ్యానింగ్ యాక్ట్ మేరకు చర్యలు ఉంటాయి. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో నమోదైన కేసులపై విచారణ చేపడుతున్నాం. బాధితులకు న్యాయం అందేలా చూస్తాం. ఇలాంటి వ్యాపారాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సులభంగా డబ్బులు సంపాదించవచ్చని చెప్పే వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందించాలి.

– శ్రీనివాసరావు, ఎస్పీ

దందా సాగుతోంది ఇలా..

ఏపీకి చెందిన గొలుసు కట్టు వ్యాపారులు ఐబీసీసీ పేరుతో గద్వాలకు చెందిన యువతను లక్ష్యంగా చేసుకొని వారి నుంచి రూ.10వేలు చెల్లించి సభ్యునిగా చేర్చుకుంటున్నారు. అతను మరో నలుగురు యువకులకు సభ్యత్వం ఇప్పించేలా దందా కొనసాగింది. ఈ నిర్వహణపై మీడియాలో కథనాలు సైతం వచ్చాయి. చర్యలు మాత్రం శూన్యంగా మారింది. గోల్డ్ స్కీంలు, గంధం చెట్ల పెంపకం ఇలా.. ఎన్నో స్కీంలు కొనసాగుతున్నాయి. అయితే ఈ దందాలపై గద్వాల, అయిజ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు కాగా కొన్ని కేసులు సీఐడీకి బదిలీ అయ్యాయి. తాజాగా స్టాక్ మార్కెట్, రూ.లక్షలకు రూ. 40వేలు, రూ. 12వేలు పేడితే రూ.48 వేలు ఆదాయం వస్తుందని చేప్పే స్కీంలు వెలుగులోకి వచ్చాయి. అయితే, జిల్లాలో ఇలాంటి స్కీంలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోగా.. తమకేందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికితోడు జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించినా సీవిల్ కేసుగా సూచిస్తూ కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాల్సిందిగా అధికారులు చెబుతున్నారు. ఇలాంటి చిక్కుముడులు నేపథ్యంలో గొలుసుకట్టు స్కీంలకు అడ్డుకట్ట పడడం లేదని బాధితులు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు బాధితులపై కంటే నిందితుల పట్ల కనికరం కనబరుస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



ఎస్పీకి వినతిపత్రం అందించేందుకు వచ్చిన బాధితులు (ఫైల్)

జిల్లాలో పలు ఘటనలు ఇలా..

■ 2024 డిసెంబర్ 22న గద్వాలకి చెందిన ఓ వ్యక్తి ఎల్ఎఫ్ఎల్ కంపెనీ పేరుతో గొలుసుకట్టు స్కీం ప్రారంభించాడు. ఈ స్కీంలో సభ్యుడు రూ. 12వేలు డిపాజిట్ చేస్తే 45 రోజుల్లో రూ. 48వేలు ఆదాయం సమాకూరుతుందని ప్రజల నుంచి ఈ సంస్థలో పెట్టుబడులు రాబట్టేందుకు బీరోలు చౌరస్తాలోని ఓ బాంక్విట్‌హాల్ నందు 200 మంది సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ స్కీంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వీటికి సంబంధించిన అనుమతి, రిజిస్ట్రేషన్ లావాదేవీల చెల్లింపుల నివేదికలను చూయించాల్సిందిగా పోలీసులు వాకబు చేయగా నిర్వాహకుడి నుంచి సమాధానం లేదు. దీంతో ఈ సంఘటన పై పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వాహకుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

■ 2024 డిసెంబర్ 29న అయిజ పట్టణంలో ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేటు లిమిటేడ్ కార్యాలయన్ని ప్రారంభించారు. ఈ సంస్థలో రూ.లక్ష పెట్టుబడి పేడితే ప్రతి నెల రూ. 40 వేల ఆదాయం అందజేస్తామని ఆ కంపెనీ నిర్వాహకులు నమ్మబలుకుతూ వ్యాపారం చేస్తున్నారు. ఆ సంస్థలో కొత్త వ్యక్తులను చేర్పిస్తే కొంత కమీషన్ సైతం అందజేస్తామని ప్రకటనలు చేయగా.. పలువురు పెట్టుబడులు పెట్టారు. అయితే కొన్ని రోజులకే ప్రజలకు శఠగోపం పెట్టిందీ కంపెనీ. మోసపోయిన బాధితులు లబోదిబోమన్నారు. ఈ క్రమంలో ఒకరు తనకు ఇవ్వాల్సిన డబ్బులు సంస్థ నిర్వాహకుడు ఇవ్వడం లేదని అయిజ పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

■ 2025 జనవరిలో చోటుచేసుకున్న ఘటన విషయానికి వస్తే.. గద్వాల మండలం పూడూరు ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్టాక్ మార్కెట్‌లో వివిధ కంపెనీల షేర్లను కొనుగోలు చేస్తు వ్యాపారం చేస్తున్నాడు. అయితే గద్వాల పట్టణంలోని ఏంజెల్ -1 పేరుతో కార్యాలయం ప్రారంభించి తెలిసిన వ్యక్తులు, బంధువుల నుంచి రూ. 3 కోట్లు అప్పు తీసుకుని తన భార్య పేరుతో స్టాక్ మార్కెట్‌లోని వివిధ కంపెనీల షేర్లు కొనుగోలు చేసి లాభాలకు విక్రయాలు చేసేవారు. వచ్చిన లాభాలను రుణం తీసుకున్న వ్యక్తులు, బంధువులకు చెల్లింపులు చేస్తూ పలువురికి స్టాక్ మార్కెట్‌లో ఖాతాలను ఓపెన్ చేశాడు. ప్రమాదవశాత్తు ఆ వ్యక్తి మృతి చెందడంతో కథ అడ్డం తిరిగింది. ఇచ్చిన రుణం చెల్లించాల్సిందిగా మృతుడి కుటుంబ సభ్యులను వారు ఒత్తిడి తీసుకువచ్చారు. నేడు రేపు అంటూ దాటవేయడంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించి గద్వాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పై మూడు కేసులలో రూ. 20కోట్ల మేర బాధితులు మోసపోయినట్లు తెలుస్తోంది. తమకు ఎలాగైన న్యాయం చేయాల్సిందిగా ప్రజాప్రతినిధుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. నడిగడ్డలో ఇలాంటి గొలుసుకట్టు వ్యాపారాల్లో ప్రజలు పెట్టుబడులు పెట్టడం.. మోసపోవడం పరిపాటిగా మారింది.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ధరూరులో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలచ ఆవరణలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని, సీఎం, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శీనివాస్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఇందిరమ్మ మోడల్ నిర్మాణానికి భూమి పూజలు చేయాలని వచ్చిన ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. త్వరలోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అర్హులను గుర్తించి పేదలకు ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడతామన్నారు. రూ.5 లక్షలతో ఒక బెడ్ రూం, కిచెన్, హాల్ వంటి విధంగా ఇంటి నిర్మాణ చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, జెడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, శ్రీధర్‌గౌడ్, కురుమన్న, వేణుగోపాల్, పద్మావెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి.

గట్టు : గ్రామాల్లో నిర్వహించే జాతరలు గ్రామీణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని గ్రామస్తులంతా ఉత్సవాలను కలిసిమెలిసి జరుపుకొంటున్నట్లుగానే గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆలూరు గ్రామంలో నిర్వహించిన ఆంజనేయస్వామి రథోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి రథోత్సవానికి పూజలను నిర్వహించారు. మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, మాజీ సర్పంచు నర్సన్‌గౌడ్, నాయకులు రాముశెట్టి, తిమ్మప్ప, చంద్రశేఖర్,మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో మంగళవారం సీతా రాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భువనచంద్ర, దత్తుస్వామి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు హాజరుకాగా.. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటికి రోడ్డెక్కిన ఆర్డీఎస్ రైతులు



శాంతినగర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

శాంతినగర్: ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందక సాగుచేసిన పంటలు ఎండుతున్నాయంటూ మంగళవారం అన్నదాతలు ఆగ్రహించి రోడ్డెక్కి నిరసన తెలిపారు. వడ్డేపల్లి మండలానికి చెందిన వివిధ గ్రామాల రైతులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని అలంపూర్-రాయచూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఎండుతున్న మొక్కజొన్న, జొన్న మొక్కలను ప్రదర్శిస్తూ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యాంలో 72 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ అధికారులు నీటిని విడుదల చేయకపోవడం బాధాకరమని.. రాజకీయ జోక్యంతో అప్పుడు ఇప్పుడంటూ నాయకులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రూ.లక్షల పెట్టుబడి పెట్టి పంటలు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టుకు సాగునీరు నిలిచిపోయిందంటూ ప్రభుత్వానికి వ్య తిరేకంగా నినాదాలు చేశారు. మార్చి నెలాఖరు వర కు సాగునీరు విడుదల చేయకపోతే ఆయకట్టు కింద 30 వేల ఎకరాల పంటలు ఎండిపోతాయని, అ లాంటి పరిస్థితి తలెత్తితే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు రోడ్డెక్కితే అనుమతులు లేవు.. అరెస్ట్ చేస్తామని పోలీసులు బెదిరించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంతోశ్ అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని సూచించడంతో ఆందోళన విరమించారు.

పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందించాలి



కంచుపాడులో మాట్లాడుతున్న సురవరం సుధాకర్‌రెడ్డి

ఉండవెల్లి: పంటలు బాగా పండితే రైతు బాగుంటాడని.. ఆర్డీఎస్ పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందేలా మంత్రులు, ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కంచుపాడులో విలేకర్లతో మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలోని 40వేల ఎకరాలకు మాత్రమే ఆర్డీఎస్ ద్వారా నీరు అందిందని, మిగతా 40వేల ఎకరాలకు, చివరి ఆయకట్టుకు నీరు అందకపోవడంతో పంటలకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. అలాగే, అలంపూర్‌లో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిలో వైద్య సేవలు త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, అలంపూర్ చౌరస్తాలో మినీ డిపో ఏర్పాటు చెయ్యాలని పేర్కొన్నారు. కంచుపాడుకు జాతీయ రహదారి నుంచి ఇటిక్యాలపాడు మీదుగా బీటి మంజూరైన ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్నారు. సమస్యలపై దృష్టి సారించాలని మంత్రులను కోరారు. ఇదిలాఉండగా, మాజీ పార్లమెంట్ సభ్యుడు మందా జగన్నాథం మరణం తీరని లోటని తెలిపారు.

నేతన్నల్లో ఆనందం

- చేనేత సంక్షేమానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- కొనసాగనున్న సంక్షేమ పథకాలు



చేనేత మగ్గాలు

అమరచింత: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన చేనేత సంక్షేమ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా యధావిధిగా కొనసాగిస్తూ ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో నేతన్నలు సంతోషిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నేతన్నకు చేయూత, త్రిఫ్ట్ ఫండ్, బీమా పథకాల అమలుకు ఏడాదికి ఎన్ని నిధులు అవసరమో వాటి ప్రకారం మంజూరు చేస్తూ గత పథకాలను యధావిధిగా కొనసాగించేందుకు సిద్ధమవ్వడంతో చేనేత, జౌళిశాఖ అధికారులు గ్రామాల్లోని చేనేత సొసైటీలను సంప్రదించి పథకాలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. కాగా ఇప్పటి వరకు లబ్ధి పొందుతున్న నేత కార్మికులకే వర్తింపజేస్తామని.. కొత్త దరఖాస్తులకు త్వరలోనే ప్రకటన జారీ చేస్తామని వివరించారు. తెలంగాణ చేనేత అభయహస్తం పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాల జీఓను రాష్ట ప్రభుత్వం జనవరి 10న జారీ చేసింది.

త్రిఫ్ట్ ఫండ్..

ఈ పథకం జియో ట్యాగ్ కలిగిన మగ్గాల నేత కార్మికులు, అనుబంధ కార్మికుల సంక్షేమానికి రూపొందించింది. కార్మికుల్లో పొదుపును ప్రోత్సహించడంతో పాటు సామాజిక భద్రత కల్పిస్తుంది. నేత కార్మికులు, అనుబంధ కార్మికులు వారి వేతనాల నుంచి నెలవారీగా 3 శాతం కాంట్రిబ్యూషన్ చేస్తారు. కాంట్రిబ్యూషన్ గరిష్ట పరిమితి రూ.1200. ఇందుకు ప్రభుత్వం రెండింతలు అంటే రూ.2,400 అందిస్తుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 38 వేల మంది, జిల్లాలో 975 మంది నేత కార్మికులు, అనుబంధన కార్మికులు లబ్ధి పొందుతున్నారు. పవర్‌లూమ్, మరమగ్గాల కార్మికుల నెలసరి వాటాగా 8 శాతం బ్యాంకులో జమ చేస్తే ప్రభుత్వం 8 శాతం కాంట్రిబ్యూషన్ చేస్తుంది.

తెలంగాణ నేతన్న భద్రత..

ఈ పథకం జియో ట్యాగింగ్ ఉన్న చేనేత, మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులకు వర్తిస్తుంది. నేతన్న భద్రతలో నమోదైన కార్మికుడు మృతిచెందితే రూ.5 లక్షల నగదు అతడి నామినీకి అందుతుంది. సహకార సంఘం ద్వారా బీమా కవరేజీ అందరికీ వర్తిస్తుంది. ఈ పథకంలో ఇప్పటి వరకున్న 65 ఏళ్ల గరిష్ట వయో పరిమితిని ఎత్తివేశారు. 59 ఏళ్లు దాటిన వారికి ఇది వర్తిస్తుంది. ఈ పథకం అమలుకు ఏడాదికి రూ.9 కోట్లు మంజూరు చేస్తారు.

నేతన్నకు భరోసా..

నేత కార్మికులకు వేతన ప్రోత్సాహకం ఈ కార్యక్రమం ప్రాథమిక లక్ష్యం. జియో ట్యాగ్ ఉన్న మగ్గాల నుంచి నిర్దిష్ట ఉత్పత్తి ప్రమాణాల ఆధారంగా చేనేత కార్మికులకు ఏడాదికి రూ.18 వేలు. అనుబంధ కార్మికులకు రూ.6 వేలు వేతన సాయంగా అందిస్తారు. పథకం అమలుకు రాష్ట్రవ్యాప్తంగా వార్షిక బడ్జెట్‌లో రూ.44 కోట్లు మంజూరు చేశారు.

ఉమ్మడి జిల్లాలో చేనేత కార్మికులు 10,550	
చేనేత సొసైటీలు 107	మాస్టర్ వీవర్స్ (దాదాపు) 100
	చేనేత మగ్గాలు 4,296

ఏడాది వారీగా నిధుల మంజూరు ఇలా..	
తెలంగాణ నేతన్నకు చేయూతకు రూ.15 కోట్లు	తెలంగాణ నేతన్న భద్రతకు రూ.5.25 కోట్లు
తెలంగాణ నేతన్న భరోసా పథకానికి రూ.31 కోట్లు	

సంతోషంగా ఉంది..



రాష్ట ప్రభుత్వం త్రిఫ్ట్ పథకాన్ని కొనసాగించేందుకు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ఈ పథకంలో కార్మికుడు ప్రతి నెల రూ.1200 బ్యాంకులో జమ చేయడంతో ప్రభుత్వం వాటికి రెండింతలు చెల్లిస్తుంది. దీంతో కుటుంబ పోషణ సాఫీగా సాగుతోంది.

– గాజుల సంధ్య, నేత కార్మికురాలు, అమరచింత

చేనేతన్నకు బీమా మంచిదే..



చేనేత కార్మికులకు ప్రభుత్వం బీమా లబ్ధి చేకూర్చేందుకు మార్గదర్శకాలను సవరించడం సంతోషం. గత ప్రభుత్వంలో వయో పరిమితి 65 ఏళ్లు ఉండగా.. ప్రస్తుతం 57 ఏళ్లకు సవరించడంతో అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడం సంతోషం.

– పగుడాకుల పద్మమ్మ, కార్మికులు, అమరచింత

మార్గదర్శకాలు రాగానే..



రాష్ట ప్రభుత్వం చేనేత సంక్షేమ పథకాల కొనసాగింపునకు నిధులు మంజూరు చేసింది. జిల్లాకు ఎన్ని నిధులు వస్తున్నాయి.. ఎంత మందికి లబ్ధి చేకూరుతుందన్న విషయాలపై ఇంకా మార్గదర్శకాలు అందలేదు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు వచ్చిన వెంటనే కార్మికులకు సమాచారం ఇస్తాం.

– గోవిందయ్య, ఏడీ

చేనేత మార్క్..

చేనేత, సిల్క్ మార్క్ మాదిరే తెలంగాణకు ప్రత్యేకమైన చేనేత మార్క్ లేబుల్ రూపొందించారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లలో ప్రీమియానికి అనుగుణంగా తెలంగాణ చేనేత ఉత్పత్తుల లేబుల్ బ్రాండింగ్ చేస్తారు. తెలంగాణ చేనేత వస్త్రాల వారసత్వ, సంప్రదాయ ప్రతిష్టతను పెంపొందించడం, చేనేత బ్రాండ్ ప్రచారంతో తెలంగాణ చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు, సముచిత మార్కెట్ సృష్టించడమే ప్రధాన లక్ష్యం.

క్లుప్తంగా

పోతిరెడ్డిపల్లిలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన మెంట బాలస్వామి(35) మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. పోతిరెడ్డిపల్లికి చెందిన మెంట బాలస్వామి కుటుంబం గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎనిమిది రోజుల క్రితం గొర్రెలు అమ్మే విషయమై భార్యతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. మంగళవారం పాలమూర్-రంగారెడ్డి ప్రాజెక్టు కట్టపై విగతజీవిగా పడిఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. గొడవ పడి ఇంటి నుంచి వెళ్లాడని, చుట్టాల ఇండ్లలో ఉన్నాడేమోనని అనుకున్నట్లు భార్య ఎస్ఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బాలస్వామి మృతదేహం గుర్తు పట్టలేనంతగా ఉండడంతో డాక్టర్ వచ్చి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో మహిళ..


చంద్రమ్మ(ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని వల్లభాపురం గ్రామంలో చంద్రమ్మ(50) అనే మహిళ పాముకాటుకు గురై సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. వల్లభాపురంలో సోమవారం ఇంటిముందు అరుగుపై నిద్రిస్తున్న చంద్రమ్మను నాగుపాము కాటేసింది. కుటుంబ సభ్యులు గుర్తించి మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లినా మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త, ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారం రోజుల క్రితం ఇదే గ్రామంలో కృష్ణమ్మ అనే మహిళ కూడా పాముకాటుకు గురై మరణించింది.

రైలు ఢీకొని వ్యక్తి..

ఆత్మకూర్: రైలుపట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందిన ఘటన వె లుగుచూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలి పిన వివరాలు.. ఆత్మకూర్ మండలంలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్, గద్వాల మధ్య రైలు పట్టాలపై 13వ తేదీ అర్ధరాత్రి ఓ వ్యక్తి(35) శవం పడి ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు. 14వ తేదీన సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని గద్వాల ఆస్పత్రికి తరలించామన్నారు.

చికిత్స పొందుతూ..

మిడ్జిల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన తిమ్మాజిపేట మండలంలో బుధవారం చో టుచేసుకుంది. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు వివరాల ప్రకారం.. తిమ్మాజిపేట మండలంలోని చే గుంటకి చెందిన గడ్డం చెన్నయ్య (48) మిడ్జిల్ మండలంలోని దోనూర్‌కి చెందిన శ్రీనివాస్‌గౌడ్ దగ్గర కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడే ఉంటూ వ్యవసాయ పనులు చేన్నాడు. అప్పుల బాధ భరించలేక ఈనెల 11న గడ్డిమందు తాగాడు. దీన్ని గమనించిన భార్య సంతోష చుట్టుపక్కల వారితో సహకారంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించింది. చికిత్సపొందుతూ 14న రాత్రి చెన్నయ్య మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత బలవన్మరణం


రామగళ్ల కవిత (ఫైల్)

కోయిల్‌కొండ: వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని సూరారంలో చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామగళ్ల కవిత (25)ను భర్త రామగళ్ల కృష్ణయ్య, అత్త అనంతమ్మ వరకట్నం తీసుకురావాలంటూ నిత్యం వేధించే వారని, దీంతో కవిత మంగళవారం మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బాలికల, బాలుర విభాగం విజేత తెలంగాణ జట్లకు ట్రోఫీ అందజేస్తున్న చైర్మన్లు కొత్వాల్, ఆనంద్‌గౌడ్, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీ.వెంకటేశ్

చాంపియన్లు.. తెలంగాణ జట్లు

నేషనల్ హ్యాండ్‌బాల్ బాల, బాలికల విభాగాల్లో తెలంగాణకే టైటిళ్లు

- రన్నరప్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్లు
- మూడో స్థానంలో యూపీ, హర్యానా
- విజేతలకు ట్రోఫీలు అందజేసిన చైర్మన్లు కొత్వాల్, ఆనంద్‌గౌడ్


ఫైనల్‌లో తలపడుతున్న తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జరిగిన అండర్-17 స్కూల్ గేమ్స్ నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్లుగా తెలంగాణ జట్లు నిలిచాయి. బాలుర, బాలికల విభాగాల్లో తెలంగాణ జట్లు అద్వితీయమైన ప్రతిభ కనబరిచి టైటిళ్ల గెలుచుకున్నాయి. బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు, బాలికల విభాగంలో రాజస్థాన్ జట్టు, మూడోస్థానంలో బాలురలో ఉత్తరప్రదేశ్ జట్టు, బాలికల్లో హర్యానా జట్లు నిలిచాయి. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 10 నుంచి ప్రారంభమైన నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీ మంగళవారం ముగిసింది.

ఫైనల్‌లో ఏపీపై తెలంగాణదే విజయం

స్టేడియంలో బాలుర విభాగంలో తెలంగాణ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాష్ట్ర క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. తొలి అర్ధభాగంలో 10-4 గోల్స్‌తో ఆధిక్యంతో ఉన్న తెలంగాణ రెండో అర్ధభాగంలో కూడా అదేరీతిలో ప్రదర్శనను కొనసాగించింది. మ్యాచ్ ముగిసే సమయానికి చివరకు తెలంగాణ జట్టు 18-7 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

బాలికల విభాగంలో తెలంగాణ విన్నర్..

బాలికల విభాగం ఫైనల్‌లో తెలంగాణ జట్టు-రాజస్తాన్ జట్టు హోరాహోరీగా తలపడ్డాయి. నువ్వా నేనే రీతిలో సాగిన మ్యాచ్‌లో చివరగా తెలంగాణ జట్టు 12-9 గోల్స్ తేడాతో రాజస్తాన్ జట్టుపై విజయం సాధించి టోర్నీలో విన్నర్‌గా నిలిచింది.

స్పోర్ట్స్ యూనివర్సిటీతో ఉజ్వల భవిష్యత్

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, త్వరలో ఏర్పాటు కానున్న స్పోర్ట్స్ యూనివర్సిటీతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్వాల్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ హబ్‌గా మారుతున్నట్లు తెలిపారు. టోర్నీ విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. నేషనల్ హ్యాండ్‌బాల్ గెలుపొందిన తెలంగాణ బాల, బాలికల జట్లకు, ఓడిన జట్లకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా పోటీల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, పాల్గొనడమే గొప్ప అని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ అన్నారు. నేషనల్ హ్యాండ్‌బాల్ టోర్నీలో దేశంలోని రాష్ట్రాల జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు విన్నర్, రన్నరప్, మూడోస్థానం జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పి.రజనికాంత్‌రెడ్డి, ఎండి.జియావుద్దీన్, ఎస్‌జీఎఫ్ఐ ఫీల్డ్ ఆఫీసర్ దేవేందర్‌నాథ్‌గోస్వామి, పీడీలు వేణుగోపాల్, బాల్‌రాజు,నాగరాజు, రాఘవేందర్, అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు షేక్ ఉమర్, జాజిమొగ్గ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక నిరంజన్‌షావలి దర్గా

- 17న గంధోత్సవం
- రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లుచేసిన అధికారులు


రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా

అచ్చంపేట: మండలంలోని రంగాపూర్‌లో నిరంజన్‌షావలి దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. జిల్లాలో ప్రసిద్ధి చెందిన జాతరల్లో రంగాపూర్ ఒకటి. ఈఉర్సు నల్లమల ప్రజలకు ప్రత్యేక సంబరం. ఈనెల 17వ తేదీ శుక్రవారం రాత్రి నుంచి వారం రోజులపాటు వైభవంగా ఉర్సును నిర్వహిస్తారు. హిందూ, ముస్లింలు అనే తేడాలేకుండా ఉర్సుకు జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాలో మొక్కులు చెల్లించుకుంటారు. దర్గాను సందర్శించి మొక్కుబడి చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కుబడి ఉన్న వారు కందూరు చేసి మేకలు, గొర్రెలను బలి ఇస్తుంటారు. ఉర్సు రంగాపూర్‌గా పిలవబడుతున్న ఈదర్గా వద్ద భక్తులు ఉత్సవాల సమయంలోనే కాక వివిధరోజుల్లో దర్గా దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అమ్రాబాద్ మండలం ప్రజలు ఏశుభకార్యక్రమం చేసిన మొదట కొండపై ఉన్న దర్గాను దర్శించుకొని తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

వారం రోజుల పాటు నిర్వహణ

రంగాపూర్ ఉర్సును దర్గతండా, రంగాపూర్ పంచాయతీలు, దర్గా కమిటీ ఆధ్వర్యంలోవారం రోజుల పాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 17న రాత్రి గంధోత్సవం ఉంటుంది. గంధం మొదటి రోజు ఖవాలీ, జియారత్‌తో పాటు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అచ్చంపేట పట్టణంలోని నారాయణ ప్రసాద్ ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం అనవాయితీగా వస్తుంది. ఈనెల 17న శుక్రవారం రాత్రి అచ్చంపేట మహబుబ్ స్వామి దర్గాతో పాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, బొమ్మనపల్లి, పెనిమిళ్ల, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి,కొల్లాపూర్, వనపర్తి, మహబుబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకవస్తారు. బొమ్మనపల్లి నుంచి గంధాన్ని గుర్రంపై తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణ. గ్రామాల నుంచి బయలు దేరిన గంధోత్సవాలు అర్ధరాత్రి వరకు రంగాపూర్‌కు చేరుకుంటాయి. అన్ని ప్రాంతాల నుంచి గంధోత్సవాలు చేరుకోగానే భక్తులు రెట్టించిన ఉత్సాహంతో నత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొంటారు. 18న తెల్లవారుజామున ఉర్సు ప్రారంభమై వారం రోజులు పాటు జాతర కొనసాగుతుంది.

ఉమామహేశ్వర క్షేత్ర సందర్శన...

రంగాపూర్ గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో కొండపై వెలసిన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రాన్ని కూడా దర్గా దర్శనంతరం భక్తులు సందర్శించడం అనవాయితీ. రంగాపూర్ ఉర్సుకు రెండు రోజుల ముందే శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రంగాపూర్ ఉర్సుకు వచ్చిన భక్తులు కుల, మత బేధాల్లేకుండా విధిగా ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మత సామరస్యానికి దర్పణం పట్టే ఈరెండు ఉత్సవాలు ఒకే సారి ముగుస్తాయి.

ప్రత్యేక బస్సులు


రంగాపూర్ ఉర్సు, ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. నాగర్‌కర్నూలు-అచ్చంపేట-రంగాపూర్, రంగాపూర్-ఉమామహేశ్వరం కొండపైకి 12 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు డీఎం ప్రసాద్ తెలిపారు. ఉమామహేశ్వరం కొండపైకి ప్రైవేట్ వాహనాలు అనుమంతిచరు. కింది కొండ భోగమహేశ్వరం వద్ద నిలిపివేస్తారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి ఉంటుంది.

ముగిసిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు


పూజలందుకున్న రామలింగేశ్వరస్వామి

కోడేరు: జిల్లాలో 1,400 అడుగుల ఎత్తైన ఎత్తం గట్టుపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు వైభవంగా కొనసాగాయి. అర్చకుడు మురళీధర్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి బండరాళ్లపై పాకుతూ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తమ పిల్లల తలనీలాలు సమర్పించారు. గట్టుపైకి వెళ్లలేని వారు కోడేరు వైపున ఉన్న ముఖద్వారం వద్ద దర్శించుకున్నారు. కొండ్రావుపల్లి, ఎత్తం తదితర గ్రామాల ప్రజలు భక్తులకు అన్నదానం చేశారు.


కొండపైకి ఎక్కుతున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


చంద్రయ్య (ఫైల్)

కల్వకుర్తి టౌన్: ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో నివాసముండే చంద్రయ్య (67) తన సొంత పనుల నిమిత్తం కూరగాయల మార్కెట్ నుంచి ఇంటికి వచ్చేందుకు హైదరాబాద్ చౌరస్తాకు చేరుకున్నాడు. హైదరాబాద్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా దేవరకొండ వైపు నుంచి టమాటల లోడ్‌తో వెళ్తున్న మినీ డీసీఎం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్రయ్య కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు

అమాయకులే టార్గెట్

ఏటీఎం కార్డులతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా

- ముగ్గురు దుండగులకు రిమాండ్
- రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు స్వాధీనం

షాద్‌నగర్ రూరల్: అమాయకులు, మహిళలను టార్గెట్‌గా చేస్తారు.. ఏటీఎంలలో డబ్బులు తీయడం రాని వారిని పరిచయం చేసుకుంటారు.. డబ్బులు తీసిస్తామని దృష్టిమరల్చి ఏటీఎం కార్డు మార్చేసి డూప్లికేట్ కార్డు ఇస్తారు. ఒరిజినల్ కార్డుతో డబ్బులు డ్రా చేసుకుంటారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ముగ్గురు సభ్యులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణ సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. బిహార్ రాష్ట్రం ఈస్ట్ చంపారన్, సోనబర్సా గ్రామానికి చెందిన కరిమన్‌సహాని, రూప్‌దేవ్‌సహాని, పంజాబ్ రాష్ట్రం కపుర్తల పగ్వారాకి చెందిన సహీబ్‌సహాని కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం వచ్చారు. కూలీ పనులు చేస్తూ శంషాబాద్ మండలం తొండుపల్లిలో నివాసం ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే పథకం వేసి ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్నారు.

జడ్చర్ల కేసుతో ఆటకట్టు..

నందిగామ మండలం, శ్రీనివాసులగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి రాజు 2024 ఆగస్టు 5న జడ్చర్ల రోడ్డులోని ఐడీబీఐ ఏటీఎంకు వెళ్లాడు. ఈయనకు డబ్బులు తీయడం రాదని గ్రహించిన దుండగులు, అతని వద్దకు వెళ్లి కార్డు మార్చేశారు. కొంతసేపటి తర్వాత తన ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించిన రాజు అదేరోజు షాద్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో ముఠా సభ్యులను పట్టుకున్నారు. పోలీసుల విచారణలో షాద్‌నగర్, ఆర్‌జీఐఏ, పటాన్‌చెరు, శంషాబాద్‌లో రెండేసి చొప్పున, దుండిగల్, సనత్‌నగర్, జడ్చర్ల, గచ్చిబౌలి, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, బాలానగర్ ఏటీఎంల వద్ద ఒక్కోటి చొప్పున మొత్తం 15 దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ స్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు


ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కేరళ రాష్ట్రం కొచ్చిలో ఈనెల 13 నుంచి ప్రారంభమైన వుమెన్స్ నేషనల్ నగేశ్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ (బ్లైండ్)లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారిణులు తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్నారు. వీరిలో కల్వకుర్తి నియోజకవర్గం ఊర్కొండపేటకు చెందిన అనిత రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా అంకిత (మహమ్మదాబాద్), ప్రీతి, మహేశ్వరి (ఏనుగొండ), సంగీత (కొండాపూర్), అనూష (నారాయణపేట) నేషనల్ టోర్నీలో ఆడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అంకిత 65 బంతుల్లో 96 పరుగులు చేసి ప్రతిభచాటింది.

ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

- ఆటోను ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- కల్వకుర్తి మండలం తోటపల్లిలో విషాదం


బంగారయ్య (ఫైల్)


మహేష్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: అతివేగం ఇద్దరి ప్రాణాలు తీసింది. బ్యాంకు పని నిమిత్తం వెళ్లి వస్తున్న వారి ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని తోటపల్లికి చెందిన నాగమ్మ బ్యాంకు పని నిమిత్తం తన కుమారుడు జోగు మహేష్ (35)తో కలిసి ఆటోలో వెళ్లింది. అక్కడ పనులు ముగిశాక సాయంత్రం అదే ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. వీరి వెంట అదే గ్రామానికి చెందిన చెందిన జోగు బంగారయ్య (39), శ్రీపతి కల్వకుర్తి నుంచి బయల్దేరారు. అయితే తర్నికల్ గ్రామ సబ్ స్టేషన్ దాటిన తర్వాత ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో నడుపుతున్న మహేష్‌తో పాటు బంగారయ్యకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. నాగమ్మ, శ్రీపతికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. శ్రీపతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు బంగారయ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా.. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కళ్లెదుటే కుమారుడు ప్రాణం వదలడంతో తల్లి నాగమ్మ తీవ్ర వేదనకు గురైంది. ఇద్దరి మృతితో తోటపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేపట్టి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని తూర్పు దౌదర్‌పల్లి కాలనీ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు.. ఆకస్మిక దాడులు చేపట్టారు. పేకాట ఆడుతున్న తూర్పు దౌదర్‌పల్లి కాలనీకి చెందిన ముళ్ల మహబూబ్, తెలుగు మహేష్, చంద్రరాములు, వెంకట్రాములు, శ్రీను, రాఘవేంద్ర, అంజి, నర్సింహులు, కుర్వ భోజన్నలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు, రూ. 59,390 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



కొంగలతో కొంగొత్త అందం..

జడ్చర్ల మండలం మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయం వద్ద దుందుభీ నదిలో మోడువారిన చెట్లపై కొంగలు వాలి కొత్త అందాలు తీసుకొచ్చాయి. సూర్యాస్తమయ సమయంలో వందల సంఖ్యలో కొంగలు.. ఎండిన కొమ్మలపై వాలి మల్లెపూల వనంలా కనిపించాయి. ఆలయానికి వెళ్లిన సందర్శకులకు ఈ దృశ్యం కనువిందు చేసింది. - జడ్చర్ల టౌన్

చేపల వేటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..


పాండు(ఫైల్)

దామరగిద్ద: పండగ పూట ఆనందంగా గడపాల్సిన ఆ ఇంట విషాదం నెలకొంది. చేపలతో ఇంటికి తిరిగి వస్తాడనుకున్న వ్యక్తి మృతదేహమై తేలిన సంఘటన బుధవారం చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో లక్ష్మీపూర్ గ్రామానికి చెంది కడ్తాల పాండు(38) బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. రెండు రోజుల క్రితం పండగకు గ్రామానికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం స్థానిక ఊర చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. ప్రమాద వశాత్తు చెరువులో మునిగిపోయాడు. చీకటి పడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చెరువు గట్టుపై కుటుంబసభ్యులు పరిశీలించారు. కట్టు బట్టలు అక్కడే ఉండడంతో పోలీసులకు సమాచారమందించారు. మరుసటి రోజు చెరువులో పోలీసులు సమక్షంలో చెరువులో గాలించగా పాండు మృతదేహం బయట పడింది. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతనికి భార్యలక్ష్మి, కుమారుడు రమేష్ ఉన్నారు.

గంగారంలో..

బిజినేపల్లి: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన దుదేకుల మాబు(71) చేపల వేటకు వెళ్లి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి వెలుగుచూసింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన మాబు ఈ నెల 12న స్థానిక రంగయ్య కుంటలో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదశావత్తు కుంటలో పడి మరణించాడు. అటుగావెళ్లిన కొందరు స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. వృద్ధుడు మాబును సోమవారం ఒడ్డుకు చేర్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.